క్లుప్తంగా

ఆస్పత్రి ప్రసవాలపై దృష్టి పెట్టండి



రికార్డులు పరిశీలిస్తున్న అనురాధ

నరసన్నపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించినా ప్రసవాలు ఆశించిన రీతిలో జరగడం లేదని జిల్లా అదనపు వైద్యాధికారి ఎన్.అనురాధ అన్నారు. మండలంలోని మాకివలస పీహెచ్‌సీని శనివారం తనిఖీ చేశారు. కుష్టు, క్షయ రోగులకు అందిస్తున్న చికిత్సలపై ఆరా తీశారు. స్టోర్ రూమ్, లేబరేటరీ తదితర రూములను పరిశీలించారు. మాకివలసలో నెలకు ఒకటి చొప్పున కూడా ప్రసవాలు జరగడం లేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల ప్రసవాలపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. వైద్యాధికారి శిరీషకు పలు సూచనలు చేశారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బీమా మొత్తం అందజేస్తున్న సర్పంచ్

సారవకోట: మండలంలోని కొమ్మసరియాపల్లి గ్రామానికి చెందిన తుంగాన రమేష్ ఇటీవల మృతి చెందారు. మృతి భార్య జ్యోతికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను శనివారం సర్పంచ్ గొంటి లక్ష్మణరావు అందజేశారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులున్నారు.

80 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జూనియర్ సివిల్ జడ్జి మణి

ఆమదాలవలస: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవాలని ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి సూచించారు. కోర్టు ఆవరణలో శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 80 మందికి వైద్య పరీక్షలు చేశారు. 20 మందికి మెరుగైన వైద్యం కోసం జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కనిత విజయలక్ష్మిభాయ్, జెమ్స్ వైద్యులు టి.రమ్యశ్రీ, పి.సుదీప్తదేవి, మార్కెటింగ్ మేనేజర్ పి.రాజేశ్వరరావు, క్యాంప్ కో ఆర్డినేటర్ కె.దిలీప్, న్యాయవాదులు పాల్గొన్నారు.

భక్తిభావం అలవాటు చేసుకోవాలి



నగరసంకీర్తన నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు

ఎల్.ఎన్.పేట: ప్రతీ వ్యక్తి భక్తిభావం అలవాటు చేసుకోవాలని భగవాన్ సత్యసాయి సేవా సమితి, భజన మండలి కన్వీనర్ ఎ.నారాయణరావు అన్నారు. మండలంలోని శ్యామలాపురం గ్రామంలో శనివారం నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యసాయి పర్తి యాత్ర సందర్భంగా నగర సంకీర్తన, భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సత్యసాయి భక్తులు ఎల్ శైలజ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌ను నిర్మూలించాలి



అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి

సరుబుజ్జిలి: ర్యాగింగ్ భూతాన్ని నిర్మూలించే దిశగా పనిచేయాలని ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. యువతీ, యువకులు అప్రమత్తంగా వ్యవహరించి ర్యాగింగ్‌ను దూరంచేయాలని సూచించారు. చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ఆమదాలవలస బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి, కళాశాల సిబ్బంది, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉప ఎన్నిక

- విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు
- పటిష్ట బందోబస్ మధ్య పోలింగ్

బూర్జ: మండలంలోని పెద్దలంకాం గ్రామ సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కాగితాపల్లి గోవిందరావు 80 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. శనివారం జరిగిన ఉప ఎన్నికలో ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. టీడీపీ మద్దతుదారుడు మేమారపు అచ్చన్నాయుడుకు 170 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కాగితాపల్లి గోవిందరావుకు 250 ఓట్లు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.గణేష్ తెలియజేశారు. పంచాయతీలో మొత్తం ఓట్లు 531 కాగా.. 429 మాత్రమే పోల్ అయ్యాయన్నారు. నోటాకు 8 ఓట్లు, తిరస్కరించినవి ఒక ఓటు ఉందన్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, వైఎస్సార్‌సీపీ మండల నాయకుల నాయకులకు గోవిందరావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికలను స్థానిక ఎస్సై బి.అశోక్‌బాబు ఆధ్వర్యంలో ప్రశాంతంగా నిర్వహించారు. శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి సందర్శించారు. తహసీల్దారు ఎస్.రమణారావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉరిటి శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అధికారి మౌనిక, ఏపీఓ రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బద్రి సర్పంచ్‌గా బొమ్మాళి అసిరమ్మ..

సారవకోట: మండలంలోని బద్రి పంచాయతీ సర్పంచ్ పదవికి శనివారం జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు బొమ్మాళి అసిరమ్మ విజయం సాధించారు. ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. టీడీపీ మద్దతుదారు బలగ అమ్ములుపై అసిరమ్మ 129 ఓట్లు మెజార్టీతో గెలుపొందింది. పంచాయతీలో 1248 ఓట్లు ఉండగా 934 ఓట్లు పోలయ్యాయి. దీంట్లో 18 ఓట్లు చెల్లనవి, 4 ఓట్లు నోటాకు వచ్చాయని అధికారులు తెలిపారు. బొమ్మాళి అసిరమ్మకు 394 ఓట్లు, బలగ అమ్ములకు 265, కూన ఆదిలక్ష్మికి 253 ఓట్లు వచ్చాయి. అసిరమ్మకు అధికారులు ధ్రువీకరణ పత్రం అందించారు. అసిరమ్మకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మెండ సూర్యనారాయణ, మెండ సుందరరావు, మురళీకృష్ణ, అప్పన్న తదితరులు అభినందించారు.



నరసన్నపేట: మాకివలసలో బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సింహాచలం

బప్పడాం సర్పంచ్‌గా వెంకటనరసమ్మ

సరుబుజ్జిలి: బప్పడాం సర్పంచ్‌గా పేడాడ వెంకట నరసమ్మ 127 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ కె.మధుబాబు శనివారం తెలిపారు. మొత్తం 711 ఓట్లకు గాను 635 పోలవ్వగా, వెంకట నర్సమ్మకు 376 ఓట్లు, అరుణకుమారికి 249 ఓట్లుపడినట్లు తెలిపారు. నోటాకు ఐదు ఓట్లు , చెల్లని ఓట్లు ఐదు ఉన్నట్లు ప్రకటించారు. తెలికిపెంట పంచాయతీ 10వ వార్డు మెంబర్‌గా వండాన అప్పలనరసమ్మ ఐదు ఓట్లతో గెలుపొందినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ టి.ప్రకాశరావు వెల్లడించారు.



ఆమదాలవలస రూరల్: మజ్జి లక్ష్మికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి సురేష్

కోమర్తిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు విజయం

నరసన్నపేట: మండలంలోని కోమర్తి, మాకివలసల్లో శనివారం జరిగిన రెండు వార్డు స్థానాలకు ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కోమర్తిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు లబ్బ రాజారావు 24 ఓట్ల తేడాతో దూసి శ్రావణకుమార్‌పై విజయం సాధించారు. మొత్తం 158 ఓట్లుకు 124 ఓట్లు పోలయ్యాయి. రాజారావుకు 74 ఓట్లు వచ్చాయి. మాకివలసలో టీడీపీ బలపరిచిన అభ్యర్థి విజయం సాధించారు. 144 ఓట్లు పోలయ్యాయి. పైల సింహాచలంకు 33 ఓట్లు మెజార్టీ వచ్చింది. సింహాచలంకు 87 ఓట్లు రాగా.. బుద్దల వినోద్ కుమార్‌కు 54 ఓట్లు వచ్చాయి. మూడు ఓట్లు చెల్లలేదు. నరసన్నపేట ఎస్‌ఐ సింహాచలం, హిరమండలం ఎస్‌ఐ నారాయణస్వామి, పలువురు పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. కోమర్తి పోలింగ్‌ను తహసీల్దార్ సింహచలం, ఎంపీడీఓ మధుసూదనరావు పరిశీలించారు.



నరసన్నపేట: కోమర్తిలో లబ్బ రాజారావుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

కొరపాం మజ్జి లక్ష్మి విజయం..

ఆమదాలవలస రూరల్: మండలంలో కొరపాం గ్రామ పంచాయతీ నాల్గో వార్డుకు ఉప ఎన్నికలు శనివారం నిర్వహించారు. మజ్జి లక్ష్మి గెలుపొందారు. వార్డులో మొత్తం 103 ఉండగా 81 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి కె.సురేష్ తెలిపారు. ఓట్ల లెక్కింపు అనంతరం మజ్జి లక్ష్మి 3 ఓట్లతో వార్డు మెంబర్‌గా గెలుపొందడంతో ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన ఇద్దరు వార్డు సభ్యులు

మెళియాపుట్టి: మండలంలోని చాపర, ముకుందాపురం గ్రామాల్లో శనివారం ఇద్దరు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించినట్లు అధికారులు వెల్లడించారు. చాపర గ్రామానికి చెందిన 9వ వార్డు సభ్యుడిగా గేదెల రవి, ముకుందాపురం 4వ వార్డుకు సవర మల్లేసు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు.

పోలాకిలో..

పోలాకి: మండలంలోని కొత్తరేవు, గాతలవలస పంచాయతీల్లో శనివారం జరిగిన వార్డు మెంబర్ల ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కొత్తరేవులో అర్జాల ఉమ, గాతలవలసలో పాలిన శాంతారావు విజయం సాధించినట్లు పోలింగ్ అధికారులు ప్రకటించారు. ఎన్నికలు జరిగిన రెండు చోట్ల టీడీపీ మద్దతు సర్పంచ్‌లు వున్నప్పటికీ కొత్తరేవులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం సాధించగా, గాతలవలసలో గట్టి పోటీనిచ్చింది. గాతలవలసలో స్వయంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మేనల్లుడు మెండ శ్రీనివాసరావు సర్పంచ్‌గా ఉండటంతో ఆ పార్టీ వార్డు మెంబర్ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు కన్పించింది. నరసన్నపేట సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



జలుమూరు: బందో బస్త్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

జలుమూరులో..

జలుమూరు: జోనంకి పంచాయతీ పరిధిలో రెండో వార్డ్ ఉప ఎన్నిక శనివారం ప్రశాంతంగా ముగిసింది. తర్ర శాంతమ్మపై బొమ్మాళి సూరమ్మ విజయ సాధించినట్లు పోలింగ్ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. ఎస్‌ఐ పి.పారినాయుడు ఆధ్వర్యంలో బందోబస్త్ నిర్వహించారు.



పోలాకి: పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీఐ ప్రసాదరావు




పోలాకి: కొత్తరేవులో అర్జాల ఉమకు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

పంచాయతీ ఉప ఎన్నికల్లోనూ..

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే హవా

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: జిల్లాలో వివిధ కారణాలతో ఖాళీ అయిన సర్పంచ్, వార్డు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు అధిక సంఖ్యలో విజయం సాధించారని, ప్రభుత్వంపైన, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపైన ప్రజలకున్న నమ్మకానికి ఇదో నిదర్శనమని నరసన్నపేట ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. ఆయా పంచాయతీల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సారవకోట మండలం బద్రిలో తమ పార్టీ మద్దతుతో పోటీ చేసిన బొమ్మాళి అశిరమ్మ 135 ఓట్లు మెజార్టీతో గెలిచారన్నారు. నియోజకవర్గంలో 19 వార్డు స్థానాలకు ఎన్నికలు ప్రకటించగా పది స్థానాల్లో ముందుగానే వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా గెలిచారన్నారు. పోటీ జరిగిన వార్డు స్థానాల్లో మూడు చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారన్నారు. కేవలం ఐదు వార్డు స్థానాలు మాత్రమే టీడీపీ మద్దతుదారులు గెలిచారని తెలిపారు. ఎన్నికలు ఏవైనా వైఎస్సార్‌సీపీదే హవా అనేది మరోసారి రుజువు అయిందన్నారు. కష్టపడి పనిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ధన్యావాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ సత్తా చాటాలని నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పిలుపునిచ్చారు.



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ఎల్.ఎన్.పేట:

మండలంలోని పూశాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం ఎస్ శ్రీనివాసరావు పట్నాయక్‌తోపాటు ఇతర ఉపాధ్యాయలను శనివారం ఘణంగా సత్కరించారు. స్థానిక సర్పంచ్ ఈగల భవాని అధ్యక్షతన బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం, ఇతర ఉపాధాయలు ఎస్.శిరీష, కె.లక్ష్మణరావును సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం పి.కృష్ణారావు, వైస్ ఎంపీపీ శివ్వాల ఇందమ్మ, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ గొర్లె అన్నపూర్ణమ్మ, గ్రామ పెద్దలు శివ్వాల కిశోర్‌బాబు, శివ్వాల సుదర్శనరావు, శివ్వాల అమ్మినాయుడు, దీర్ఘాసి నిరంజనరావు, రామశంకరరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జయరామ్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎం శ్రీనివాసరావు పట్నాయక్‌ను సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ ఇందమ్మ

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

హిరమండలం:

మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం ఫొటోగ్రాఫర్లు ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ జాక్సన్ మాంగ్ డాగూరే చిత్రపటానికి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లనుకు సన్మానించారు. అనంతరం మేజర్ పంచాయతీ హిరమండలంలోని అలికాం–బత్తిలి ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఫొటోగ్రాఫర్లు మాట్లాడుతూ వంద మాటల్లో చెప్పలేనిది ఒక్క ఫొటోతో చెప్పవచ్చునన్నారు. అటువంటి వృత్తిపై మక్కువతో ఎంతో మంది ఆధారపడి జీవిస్తున్నారన్నారు. చాలావరకు ఫొటోగ్రాఫర్లకు ఉపాధి కరువైందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



జాక్సన్ మాంగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఆంధ్రా–ఒడిశా ఆర్టీసీ సర్వీస్ ప్రారంభం

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశాను కలుపుతూ ఆర్టీసీ సర్వీస్‌ను పాతపట్నంలో అధికారులు శనివారం ప్రారంభించారు. విశాఖపట్నం నుంచి గుణుపూర్ వరకు ఆర్టీసీ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సును ప్రారంభించటం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీరోజు గుణుపూర్, పర్లాకిమిడి, పాతపట్నం ప్రాంతాల నుంచి విశాఖపట్నంకు అధిక సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వారికి విశాఖపట్నం వరకు ఆర్టీసీ సేవలు అందుబాటులోకి రావటం సంతోషంగా ఉందని పలువురు ప్రయాణికులు తెలిపారు.



ఆంధ్రా–ఒడిశా ఆర్టీసీ సర్వీసు

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం

హిరమండలం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్ఫూర్తి టీమ్ మెంబర్లు ఎం.బాబూరావు, ప్రభావతి అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. దిశా చట్టం, యాప్, సైబర్‌క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. ఆడపిల్లలు బయటవారిని నమ్మవద్దన్నారు. బాల్య వివాహాలు, విద్యా చట్టాలపై అవగాన కల్పించారు. హెచ్‌ఎం టి.కేశవరావు, ఏఎస్సై సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిరమండలం: హిరమండలం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆదివారం అత్యవసర మరమ్మతుల చేయనున్నారు. మండలంలోని 23 పంచాయతీల పరిధిలో ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బూర్జ మండలంలో..

బూర్జ: మండలంలోని మదనాపురం, కొల్లివలసలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు శ్రీకాకుళం ఏఈ ఎస్.బయ్యన్నాయుడు శనివారం ఒక ప్రకటనలతో తెలియజేశారు. మండలంలో విద్యుత్ నిర్వహణ, స్తంభాల మార్పు పనులు చేపడతామన్నారు.

నేడు నరసన్నపేటలో గడపగడపకు మన ప్రభుత్వం

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధి వీరన్నాయుడు కాలనీలో ఆదివారం ఉదయం 7.30 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

'సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం'



స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీకాకుళం సెర్ప్ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు

ఆమదాలవలస: ఆంధ్రప్రదేశ్ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగుల జీతాలు పెంచుతూ ప్రభుత్వం జీఓ విడుదల చేయడంతో ఆ సంఘ నాయకులు శనివారం స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆమదాలవలసలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద కలిసి పుష్పగుచ్ఛాలతో సత్కరిరచారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు చింతాడ రామ్మోహన్, బెవర నారాయణరావు, పుల్లట రవికుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. 23 ఏళ్లుగా తాము చేస్తున్న సేవలను గుర్తించి జీతాలు పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి, ఏపీఎంపైడి కూర్మారావు తో పాటు నియోజకవర్గంలో పనిచేస్తున్న వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కన్నయ్యపేటలో గిరిజన ప్రజలకు సంక్షేమపథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

పాతపట్నం: అమ్మా బాగున్నారా, పెద్దాయనా కుశలమేనా, ఫించన్లు, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అంటూ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రతి ఒక్కరనీ ఆప్యాయంగా పలకరించారు. మండలంలోని గంగువాడ సచివాలయం పరిధి కన్నయ్యపేట, పేడూరు, మెట్టుపేట గిరిజన గ్రామాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఈ నాలగేళ్లలో అమలు చేసిన పథకాలను వివరించారు. పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. ఎటువంటి సిఫార్సులు లేకుండా అర్హులందరకీ సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే అందిస్తున్నారన్నారు. ప్రజలందరూ సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. గడపగడపలో వచ్చే ఆయా విభాగాల గ్రీవెన్స్‌ను రికార్డుల్లో నమోదు చేసి ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. పెడూరులో జగనన్న కాలనీ లబ్ధిదారుల మాట్లాడుతూ.. సీఎం జగనన్న దయతో తమ సొంతింటి కల నెరవేరిందన్నారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కె.అర్జునరావు, పీఏసీఎస్ డైరెక్టర్ పి.రంజిత్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఢిల్లేశ్వరరావు, పి.మోహన్, జి.పార్వతీశం, పి.శ్రీనివాసరావు, వరదరాజులు, రాము, టి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

మెళియాపుట్టి: జీతాల పెంపుపై మండలంలో పని చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. 23 శాతం మేర జీతాలు పెంచడంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. శనివారం వెలుగు ఏపీఎం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రెడ్డిశాంతిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సీసీలు వీరం నాయుడు, గణేష్, చంద్రమౌళి, బాలకృష్ణ కరుణాకర్ తదితరులు ఉన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ

కొత్తూరు: మండలంలోని బలగ గ్రామంలో జగనన్న భూహక్కు పత్రాలను భూ యజమానులకు స్థానిక తహసీల్దార్ చక్రవర్తి శనివారం పంపిణీ చేశారు. రెవెన్యూ గ్రూపులో 650 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా.. 250 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న సమగ్ర భూముల రీ సర్వే కార్యక్రమంతో వంద ఏళ్ల నుంచి వస్తున్న సమస్యలు తీరుతున్నట్లు చెప్పారు. భూములు ఉన్నప్పటకీ ఆయా భూ యజమానుల పేరుపై నమోదుకాకపోవడంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు రకాల పథకాలు అందడం లేదన్నారు. రీ సర్వేతో ఇటువంటి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆర్‌ఐ గిరిష్ కుమార్ పట్నాయక్, రైతులు పాల్గొన్నారు.